# చేతివృత్తులకు కరువైన ఆదరణ

- శ్రమపడి బట్టలు అల్లినా కొనేవారు లేరు
- ఆందోళన చెందుతున్న ఎస్టీలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ఒకప్పుడు చేతివృత్తిదారులు తమ నైపుణ్యంతో వివిధ రకాల వస్తువులను తయారుచేసేవారు. వాటికి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో గిరాకీ కూడా ఉండేది. నాలుగు డబ్బులు సంపాదించుకుని కుటుంబాలను పోషించుకునేవారు. నేడు ఆ పరిస్థితి మారింది. మార్కెట్‌లోకి వివిధ రకాల ప్లాస్టిక్ వస్తువులు వస్తుండడంతో చేతివృత్తిదారులకు ఆదరణ కరువైంది. వారు వేరే పనులు చేయలేక, కుటుంబాల పోషణ కష్టమై చేతివృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – దొరవారిసత్రం



బూదూరు ఎస్టీ కాలనీలో బుట్టలు అల్లే పనిలో నిమగ్నమైన గిరిజనులు

దొరవారిసత్రం మండలం పరిధిలో బూదూరు, ఆనేపూడి, కొత్తపల్లి, ఏకొల్లు తదితర గ్రామాల్లో చేతివృత్తినే నమ్ముకుని సుమారు 15 ఏళ్లుగా 50 కుటుంబాలకుపైగా గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. వారు అడవికి వెళ్లి ఈత మండలను సేకరించి వివిధ రకాల బుట్టలు అల్లి చుట్టు పక్కల గ్రామాలతో పాటు, సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ తదితర ప్రాంతాల్లో విక్రయించేవారు. రానురాను బుట్టలు కొనేవారు లేకుండా పోవడంతో గ్రామాల్లో ఎస్టీల కుటుంబాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఎక్కువ మంది పట్టణ ప్రాంతాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ స్థిర పడిపోయారు. ప్రస్తుతం బూదూరు, కొత్తపల్లి గ్రామాల పరిధిలోని ఎస్టీ కాలనీలో 15 కుటుంబాల వారు బుట్టలను అల్లే వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఆడమగ అందరూ కలిసి అటవీ ప్రాంతాల నుంచి ఈత మండలను తీసుకువచ్చి వాటిని తగిన విధంగా చీల్చుకుని బుట్టలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామాల్లో తిరిగి అతికష్టం మీద విక్రయాలు సాగిస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులు రావడంతో ఈత బుట్టలను కొనుగోలు చేయడం లేదు. దీంతో తమ శ్రమకు తగిన ఫలితం రావడం లేదని గిరిజనులు వాపోతున్నారు. బూదూరు ప్రాంతంలోని ఎస్టీలకు బుట్టలు అల్లిక తప్ప వేరే ఆస్తిపాస్తులు లేవు. స్థానికంగా వ్యవసాయ పనులు కూడా పెద్దగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 2 నుంచి 4 బుట్టల వరకు అల్లుకుని వారంలో ఒక్కరోజు గ్రామాల్లో తిరిగి విక్రయించుకుని వచ్చే అరకొర ఆదాయంతో చాలీచాలని జీవితం గుడుపుతున్నామని వాపోతున్నారు.

**బుట్టలు కొనేవారు లేరు**



అటవీ ప్రాంతానికి వెళ్లి ఈత మండలు కోసుకుని వస్తాం. వాటిని ఎండబెట్టి ఎంతో కష్టపడి బుట్టలు అల్లుతాము. గ్రామాలకు వెళ్లి అమ్ముకుందామనుకుంటే కొనేవారు లేకుండాపోతున్నారు. ఎవరో ఒకరిద్దరు తక్కువకు కొంటున్నారు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. ప్రభుత్వం చేతివృత్తుల వారిని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలి. - అల్లెయ్య, బూదూరు ఎస్టీ కాలనీ

**కష్టానికి తగిన ఫలితం రావడం లేదు**



రోజంతా కష్టపడి రెండు నుంచి మూడు బుట్టలు అల్లుతున్నాను. ఎక్కడ చూసిన ప్లాస్టిక్ సామాన్లు విచ్చలవిడిగా రావడంతో బుట్టలను కొనేవారు లేకుండాపోయారు. ఒకరిద్దరు కొన్నా కష్టానికి తగిన ఫలం దొరకడం లేదు. మాలాంటి చేతివృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్లాస్టిక్ వస్తువుల కన్నా ఈత, వెదురుతో చేసిన వస్తువులు ఆరోగ్యానికి కూడా మంచి చేస్తాయి. - పోలయ్య, కొత్తపల్లి ఎస్టీ కాలనీ

## క్లుప్తంగా

### తహసీల్దార్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి



తహసీల్దార్‌కు వీడ్కోలు పలుకుతున్న కార్యాలయ సిబ్బంది

గూడూరు రూరల్ : గూడూరు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న బాల లీలారాణి పదోన్నతిపై డిప్యూటీ కలెక్టర్‌గా అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె గూడూరు డివిజన్‌లోని చిల్లకూరు, కోట, గూడూరు మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. బదిలీపై వెళుతున్న ఆమెను కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. డీటీ శిరీష, ఆర్‌ఐ చక్రి తదితరులు పాల్గొన్నారు.

### కమిషనర్‌కు సత్కారం



కమిషనర్ జనార్ధన్ రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం జనార్ధన్ రెడ్డిని గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలు కప్పి సత్కరించారు. పి.రాహుల్, షేక్ షబ్బీర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఎన్‌సీఆర్ పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ

సైదాపురం: మండలంలోని గిద్దలూరు, సైదాపురంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఏడీఏ వింజమూరు రామిరెడ్డి తనిఖీలు చేపట్టారు. రిజిస్టర్లు, లైసెన్స్‌లను పరిశీలించారు. రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏవో హైమావతి పాల్గొన్నారు.

### పాస్టర్లకు నిత్యావసర వస్తువుల పంపిణీ



పాస్టర్లకు బియ్యం అందజేస్తున్న బిషప్ తదితరులు

చిల్లకూరు : మండలంలోని పలు సంఘాలకు చెందిన పాస్టర్లకు గురువారం క్రైస్ట్ ఎవాంజికల్ లూథరన్ మినిస్ట్రీస్ బిషప్ కూరపాటి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బియ్యం, నూనె, కందిపప్పు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తుపాను సమయంలో ఎంతో మంది తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. వారిలో సంఘకాపరులు కూడా ఉన్నారని తెలిపారు. వారిని సంస్థ ద్వారా ఆదుకోవాలనే తలంపుతో పాస్టర్లకు నిత్యావసరాలు అందిస్తున్నామని తెలిపారు. కోశాధికారి గడ్డం హానోక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నదానం



ఓజిలి: మానమాలలోని సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ముమ్మడి కృష్ణయ్య జ్ఞాపకార్థం వీరాస్వామి, పద్మమ్మ 200 మందికి అన్నదానం చేశారు.

### పేదలకు దుప్పట్ల పంపిణీ



వాకాడు : మండలంలోని కోడివాక గ్రామంలో గురువారం 30 మంది పేదలకు షిరిడీ సాయి అక్షయ సేవా సమితి ప్రతినిధులు దుప్పట్లు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన తరుణ్ క్రిష్ణ, రుక్మిణీప్రియ దంపతుల దుప్పట్లు అందజేశారు. సంస్థ నిర్వాహకులు అల్లం రమణయ్య, పెళ్ళూరు కోటేశ్వరరెడ్డి, గంగిరెడ్డి వెంకటరామిరెడ్డి, పన్నగ సాయి పాల్గొన్నారు.

### అక్రమ మైనింగ్‌పై నిఘా

సైదాపురం: ఖనిజాన్ని అక్రమంగా తవ్వకాలు జరిపి తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆయన గురువారం విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్‌తో కలిసి సైదాపురంలో తనిఖీలు చేపట్టారు. అనుమతి లేకుండా అక్రమ తవ్వకాలను సాగిస్తున్న హిటాచీతో పాటు టిప్పర్‌ను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.

### నేడు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. సచివాలయ పరిధిలోని ఈ అవకాశాన్ని అన్ని ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఉత్తమ సేవా పురస్కార గ్రహీతకు సత్కారం



రాపూరు ఎంఈవో శ్రీనివాసులును సన్మానిస్తున్న నెల్లూరు నగర మేయర్ స్రవంతి

రాపూరు: నెల్లూరులో జరిగిన గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ హరినారాయణ్ నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎంఈవో గుండవోలు శ్రీనివాసులును గురువారం ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. నెల్లూరు మేయర్ స్రవంతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంఈవో విధి నిర్వహణలో ఉత్తమసేవలు అందించడం అభినందనీయమన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు ఆయన సేవలను కొనియాడారు. ఎంఈవో–2 జిలాని తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ నేతకు నివాళి



ప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం (వెంకటగిరి): పట్టణంలోని వెలమపాళెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వల్లభనేని ప్రసాద్ మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం వెలమపాళెంలోని ప్రసాద్ నివాసానికి చేరుకున్నారు. ప్రసాద్ భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## ప్రగతిలో ఘనంగా ఫ్రూట్స్ డే



పండ్ల ఆకృతిలో ఆకట్టుకుంటున్న పిల్లలు

కోట: స్థానిక ప్రగతి విద్యానికేతన్‌లో గురువారం ఫ్రూట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాలబాలికలు తమ తరగతి గదిని రకరకాల పండ్లతో అలంకరించారు. వారు తెచ్చిన పండ్లను ప్రదర్శనకు ఉంచి వాటి ప్రాముఖ్యతను వివరించారు. రకరకాల పండ్ల ఆకృతిలో ఉన్న దుస్తులను ధరించి అలరించారు. ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే పిల్లల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలు జంక్‌ఫుడ్ జోలికి పోకుండా పండ్లు తినడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మమత, నిరుపమ, భాను పాల్గొన్నారు.

## పలువురు ఎంపీడీవోలు బాధ్యతల స్వీకరణ



దొరవారిసత్రం ఎంపీడీవో శివరాజును సత్కరిస్తున్న సిబ్బంది

దక్కిలి : దక్కిలి ఎంపీడీవోగా సి.లీలామాధవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో టి.ప్రసన్నకుమారి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా నగిరి ఎంపీడీవోగా పనిచేస్తున్న లీలా మాధవి దక్కిలికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

**పెళ్లకూరులో..**

పెళ్లకూరు: పెళ్లకూరు ఎంపీడీవోగా కే సురేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు తొట్టంబేడుకి బదిలీ అయ్యారు. తొట్టంబేడు ఎంపీడీవోగా పనిచేస్తున్న సురేష్‌బాబు ఇక్కడికి వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

**దొరవారిసత్రంలో..**

దొరవారిసత్రం : దొరవారిసత్రం ఎంపీడీవో శివరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు జిల్లా యాదమరి మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయనను మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

**రాపూరులో..**

రాపూరు: రాపూరు ఎంపీడీవోగా గంగయ్య గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అన్నమయ్య జిల్లా కలికిరి మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ నెల్లూరు జిల్లా సంఘంలో ఈవోపీఆర్‌డీగా బదిలీ అయ్యారు. ఎంపీడీవోను వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి అభినందించారు.



సైదాపురం: బాధ్యతలు చేపట్టిన సుధాకర్

**సైదాపురంలో..**

సైదాపురం: సైదాపురం ఎంపీడీవోగా జి.సుధాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు జిల్లా చౌడేపల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనను సిబ్బంది అభినందించారు.



దక్కిలి : బాధ్యతలు తీసుకుంటున్న ఎంపీడీవో లీలా మాధవి



పెళ్లకూరు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌బాబు



రాపూరు ఎంపీడీవో గంగయ్య

## నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

వెంకటగిరి రూరల్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మండలంలో ఉపాధి హామీ కింద 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేసినట్టు తెలిపారు. తనిఖీల్లో వెల్లడైన వివరాలను వెల్లడించనున్నట్టు తెలిపారు. మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది తప్పక పాల్గొనాలని సూచించారు.

## వినికిడి యంత్రం అందజేత

దొరవారిసత్రం : ఏకొల్లు గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కొప్పల పవన్‌కుమార్‌కు వినికిడి యంత్రం, సమగ్రశిక్ష అభియాన్ ద్వారా ట్యాబ్‌ను ఎంఈవోలు మునిశేఖర్, కృష్ణయ్య గురువారం అందజేశారు. ఐఈఆర్టీ టీచర్స్ స్రవంతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## కండలేరులో 11.889 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 11.889 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 210 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

గంగాధర నెల్లూరు : మండలంలోని బంగారెడ్డి బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశ ప్రవేశానికి ఫిబ్రవరి 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దమయంతి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31లోపు జన్మించి ఉండాలని సూచించారు. ఓసీ, బీసీలు 2013 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన బాలికలు అర్హులని తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో 3వ తరగతి, అదేవిధంగా 2023–24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి నిరవధికంగా ప్రభుత్వ లేదా ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

## లారీ బోల్తా



చిల్లకూరు : మండలంలోని పారిచెర్లవారిపాళెం సమీపంలో గురువారం జామాయిల్ కట్టెల లోడుతో వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తాపడింది. తీర ప్రాంతంలోని రైతుల నుంచి జామాయిల్ కొనుగోలు చేసుకుని లారీలో లోడు చేశారు. లారీ పారిచెర్లవారిపాళెం సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ కిందకు దూకడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. అదేసమయంలో ఎదురుగా ఆటో వస్తున్న ఆటో డ్రైవర్ సమయ స్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. దీనిపై తమకు సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

## నేడు మారెమ్మ ఆలయ కుంభాభిషేకం

నాయుడుపేట టౌన్ : మండలంలోని చిగురుపాడు ఎస్టీ కాలనీలో నిర్మించిన మారెమ్మ ఆలయ కుంభాభిషేకాన్ని శుక్రవానం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి హోమం చేసి మారెమ్మ విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమాలను హైదరాబాద్‌కు చెందిన మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు, వీణ దంపతుల సహకారంతో చేపడుతున్నట్లు వివరించారు. వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, గురుప్రసాద్, శ్రీనివాసులు, షేక్ కరీముల్లా, వై కుమార్, టి.వెంకటేశ్వర్లు, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ప్రజాప్రతినిధులు

సైదాపురం: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవో హైమావతి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో 416 మెట్రిక్ టన్నుల యూరియా, 114 మెట్రిక్ టన్నుల డీఏపీ, 112 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు. హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీల్లో 1005 మందికి ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో 886 పక్కా గృహాలను నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలని కోరారు. ఉద్యాన శాఖాధికారి ఆనంద్ మాట్లాడుతూ నిమ్మ తోటల అభివృద్ధి పథకంలో రైతులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకుంటే హెక్టారుకు రూ.16 వేల రాయితీ వస్తుందని తెలిపారు. జెడ్పీటీసీ చిత్తలూరు పోలయ్య, వైస్ ఎంపీపీ ఈశ్వరమ్మ, ఎంపీటీసీలు రమణమ్మ, సుమతి, పద్మమ్మ, శ్రీనివాసులు, వెంకటరమణయ్య, నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఏపీఎం రాధ, ఎంఈవో దయాకర్, సీడీపీవో సునంద పాల్గొన్నారు.

## భార్య హత్యకేసులో భర్త అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

ఓజిలి: భార్య హత్య కేసులో భర్తను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. వీర్లగునపాడుకు చెందిన వల్లూరు దొరసానమ్మకు బాలాయపల్లె మండలం కోటంబేడుకు చెందిన వల్లూరు శివకుమార్‌తో 2015లో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివకుమార్ మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో దొరసానమ్మ పిల్లలను తీసుకుని ఐదేళ్ల క్రితం పుట్టింటికి వచ్చి ఉంటోంది. శివకుమార్ అప్పుడప్పుడు భార్య వద్దకు వచ్చి వెళుతున్నాడు. ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఆమెను చంపాలని పన్నాగం పన్నాడు. దొరసానమ్మ గత నెల 28న ఉదయం భర్త శివకుమార్, మేనత్త మంజులమ్మతో కలిసి కట్టెల కోసం అడవికి వెళ్లింది. అక్కడ అతను భార్యతో గొడవ పెట్టుకుని కత్తితో నరికాడు. అడ్డుకున్న మంజులమ్మ పైనా దాడి చేశాడు. దొరసానమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మంజులమ్మ కూడా గాయపడింది. మృతురాలి సమీప బంధువు మురళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నాయుడుపేట మండలం పండ్లూరు క్రాస్‌రోడు వద్ద శివకుమార్‌ను గత నెల 31న అరెస్ట్ చేసి మచ్చుకత్తిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన నాయుడుపేట రూరల్ సీఐ జగన్‌మోహన్‌రావు, ఇన్‌చార్జి ఎస్‌ఐ తిరుమలరావు, హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, సిబ్బంది మోహన్, గోవర్ధన్, వెంకటేశ్వర్లు, సుధాకర్, వెంకటేష్‌ను అభినందించారు.

## సన్మానం



కరీం సాహెబ్ దంపతులను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన షేక్ కరీం సాహెబ్‌ను జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి ఘనంగా సన్మానించారు. కరీం సాహెబ్ క్రైం బ్రాంచ్‌లో పనిచేస్తూ పలు చోరీ కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన వందకు పైగా రివార్డులు, అవార్డులు అందుకున్నారు.

## ఆడుదాం ఆంధ్రా పోటీల్లో సూళ్లూరుపేట క్రీడాకారుల ప్రతిభ



రన్నర్‌గా నిలిచిన సూళ్లూరుపేట జట్టు

సూళ్లూరుపేట : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా గురువారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో సూళ్లూరుపేట (మన్నారుపోలూరు)కు చెందిన క్రికెట్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఈ జట్టు సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో నాయుడుపేట జట్టుపై విజయం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైన విషయం తెలిసిందే. జిల్లా స్థాయిలో జరిగిన నాకౌట్ పోటీల్లో శ్రీకాళహస్తి జట్టును ఓడించి సెమీ ఫైనల్స్‌కు చేరింది. సెమీ ఫైనల్స్‌లో వెంకటగిరి జట్టును ఓడించి ఫైనల్స్‌కు చేరింది. ఫైనల్స్‌లో తిరుపతి జట్టుతో తలపడి రన్నర్‌గా నిలిచింది. జట్టు కెప్టెన్ మురళీ, సభ్యులను ఆర్డీవో ఆర్ చంద్రముని, కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి అభినందించి రూ.35 వేల నగదు బహుమతి, షీల్డ్ అందజేశారు. పీడీ భాస్కర్, మన్నారుపోలూరు సచివాలయ సిబ్బంది పురిణి కృష్ణయ్య, ఎస్ తేజస్విని, జీ నిఖిల్, ఎం రాజేశ్వరి తదితరులు అభినందించారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు నాయుడుపేట జట్టు



ఎంపికైన వారికి కప్ అందజేస్తున్న అధికారులు

నాయుడుపేట టౌన్ : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నాయుడుపేట జట్టు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. నాయుడుపేట మున్సిపాలిటీ బేరినేట సచివాలయ పరిధిలోకి చెందిన చెయ్యానూరు సాయికుమార్, సుధీర్ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో గురువారం సాయంత్రం జరిగిన డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. వారు మొదటగా కార్వర్ట్స్ ఫైనల్స్‌లో శ్రీకాళహస్తి జట్టుతోనూ, సెమీ ఫైనల్స్‌లో గూడూరు జట్టుతోనూ, ఫైనల్స్‌లో చంద్రగిరి జట్టుతో తలపడ్డారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సాయికుమార్, సుధీర్‌తోపాటు పీడీ ధనుంజయను మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్లు షేక్ రఫీ, వెంకట కృష్ణారెడ్డి, కమిషనర్ ఎం.జనార్ధన్ రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, ఎంపీడీవో శివప్రసాద్, బేరిపేట సచివాలయ అడ్మిన్ బాల కోటేశ్వరరావు అభినందించారు.

## 90 శాతానికిపైగా పింఛన్ల పంపిణీ



గోపాలయ్యకు పింఛను ఇస్తున్న వలంటీర్

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీలో గురువారం సాయంత్రానికి 90 శాతానికిపైగా పింఛన్లు పంపిణీ చేసినట్లు కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. 4,255 మంది లబ్ధిదారులు ఉండగా 3,925 మందికి పింఛను అందజేశామన్నారు.

**వాకాడులో..**

వాకాడు : మండలంలో గురువారం సాయంత్రానికి 90 శాతానికిపైగా పింఛన్లు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. మండలంలో 5,564 మందికి ప్రభుత్వం రూ.1.70 కోట్లు మంజూరుచేసినట్టు తెలిపారు.

**సైదాపురంలో..**

సైదాపురం: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో గురువారం సాయంత్రానికి 90 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీని చేపట్టినట్టు పేర్కొన్నారు.

**నెల్లూరుకు వెళ్లి పింఛను అందజేత**

రాపూరు: సైదాదుపల్లికి చెందిన ముత్యం గోపాలయ్య నెల్లూరులోని జయభారత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ సుప్రియ నెల్లూరు వెళ్లి పింఛను అందజేశారు.

## అధికారిణి వేధింపులపై రిసోర్స్‌పర్సన్ల నిరసన

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని మెప్మాలో సీఎంఎంగా పని చేస్తున్న కవిత వేధింపులను భరించలేకున్నామని రిసోర్స్‌పర్సన్లు ఆరోపించారు. వారు గురువారం గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సీఎంఎం కవిత సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంతో పాటు అసభ్యకరంగా మాట్లాడుతోందని దుయ్యబట్టారు. ఆమెపై ఇప్పటికే మిషన్ డైరెక్టర్, పీడీ, జిల్లా కలెక్టర్, గూడూరు ఆర్డీవోకు ఫిర్యాదు చేసినట్టు వివరించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంఎం కవితను వివరణ ఇస్తూ ప్రభుత్వం అందిస్తున్న ఆసరా కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని చెప్పినందుకే వారు తనపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.